సాక్షి
రంగారెడ్డి
గురువారం ; 22 ; ఆగస్టు ; 2024



శీర్షాసనం వేసి నిరసన

నెలల తరబడి తిరుగుతున్నా భూ సమస్య పరిష్కారం కావడం లేదని ఓ యువకుడు శీర్షాసనం వేసి నిరసన తెలిపాడు. 8లో▸



కంది సాగు.. బాగు

కంది పంటను ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వ్యవసాయాధికారి వెంకటేశం వివరించారు. 8లో▸



నష్ట పరిహారం చెల్లించాలి

రైతులకు నష్టపరిహారం అందించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయండి



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

మొయినాబాద్: ప్రభుత్వం రైతులందరికీ రుణ మాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామ మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం భార తీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో కలెక్టర్ శశాం కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. రైతులందరికీ రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు రేషన్ కార్డు, కుటుంబ సభ్యులతో లింకు పెట్టి అందరికీ మాఫీ చేయడం లేదని అన్నారు. ఒక కుటుంబంలో తండ్రి, కొడుకులు రుణం తీసుకుంటే ఒకరికే మాఫీ వస్తోందని.. మిగతావారికి రావడం లేద న్నారు. ఆధార్ లింకు లేదని, బ్యాంకు డాటా రాలేదని, పేర్లు తప్పుగా ఉన్నాయనే కారణా లతో చాలామంది రైతులకు రుణమాఫీ చేయ లేదన్నారు. రుణం తీసుకున్న రైతులందరికీ మాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు, వివిధ మండలాలు, గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

టెస్కాబ్ వైస్‌చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



టెస్కాబ్ వైస్‌చైర్మన్ సత్తయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాట సింగారం రైతు సేవా సహకార సంఘాన్ని బుధవారం టెస్కాబ్ వైస్‌చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం పనితీరును సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌ను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలందించాలని సూచించారు. టెస్కాబ్ వైస్ చైర్మన్ అయిన తర్వాత మొదటిసారి వచ్చిన సందర్భంగా కొత్తకుర్మ సత్తయ్యను చైర్మన్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరిం చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ రాకేష్ గౌడ్, సిబ్బంది శ్రీధర్‌గౌడ్, మద్ది ప్రవీణ్, కుర్షీద్, మమత, శరత్ పాల్గొన్నారు.

25న హైడ్రాకు మద్దతుగా వాక్



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో జల వన రుల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ఏర్పడిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కి మద్దతు పెరుగు తోంది. ఈ విభాగం దూకుడు కొందరి గుం డెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. మరికొందరు హైడ్రానే రద్దు చేయాలని డిమాండ్ చేస్తు న్నారు. 'జన్వాడ గెస్ట్‌హౌస్' వ్యవహారం ఏకం గా హైకోర్టు వరకు వెళ్లింది. ఈ పరిణామాల నేపథ్యంలో గండిపేట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హైడ్రాకు మద్దతుగా ముందుకు వచ్చారు. ఈ నెల 25న (ఆదివారం) ఉదయం 10 గంటలకు ఉస్మాన్‌సాగర్ (గండిపేట చెరువు) వద్ద హైడ్రాకు సపోర్ట్ వాక్ నిర్వహించ నున్నట్లు బుధవారం ప్రకటించారు. గండిపేట చుట్టూ జరగనున్న ఈ వాక్‌లో ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలతో హాజరు కావాలని సొసైటీ కోరింది.

ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో సెప్టెంబర్ 4 నుంచి 17 వరకు జరగాల్సిన వివిధ పీజీ కోర్సుల 2, 4 సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. యూజీసీ జేఆర్‌ఎఫ్, నెట్‌తో పాటు టీఎస్ సెట్ పరీక్షల కారణంగా పీజీ పరీక్షలను వాయిదా వేసినట్లు అధికారులు తెలి పారు. తిరిగి పరీక్షలను నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడించనున్నట్లు చెప్పారు.

బురదే 'సింగారం'!

బాటసింగారం పండ్లమార్కెట్‌పై నిర్లక్ష్యం

- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ విక్రయాలు
- వరదనీటిలో కొట్టుకుపోతున్న పండ్లు
- రైతులు, వ్యాపారులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ప్రభుత్వం



బురదమయంగా బాటసింగారం పండ్ల మార్కెట్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తాజా పండ్లను అందించి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన మార్కెట్ పరోక్షంగా వారి అనారోగ్యానికి కారణమవుతోంది. చీడ,పీడలను తట్టుకుని నిగనిగలాడుతూ మార్కెట్‌కు తరలివచ్చి న పండ్ల రాశులపై వరదనీరు పోటెత్తుతుండటంతో తాజా ఆనవాళ్లు కోల్పోతున్నాయి. వరద నీటిలో కొట్టుకుపోయిన ఈ పండ్లను కొనేందుకు చిరు వ్యాపారులు సహా సాధారణ కొనుగోలుదారులు ఆసక్తిచూపడం లేదు. మంచి లాభాలు వస్తాయని ఆశించిన రైతుకు, వ్యాపారులకు తీరా భారీ నష్టాలనే మూట కట్టుకోవాల్సి వస్తోంది.

ఆగమేఘాల మీద తరలించి

పండ్లమార్కెట్ తొలుత మొజంజాహీ మార్కెట్‌లో ఉండేది. 1986లో దీన్ని ఖాళీ చేయించి, గడ్డిఅ న్నారం (కొత్తపేటలోని 22.05 ఎకరాల విస్తీర్ణం)కు తరలించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రైతులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు సరిహద్దు రాష్ట్రాలకు చెందిన రైతులు సైతం తమ ఉత్పత్తులను ఇక్కడికి తెచ్చేవారు. ఇలా ఇక్కడ రోజుకు సగటున 1000 టన్నుల పండ్ల వ్యాపారం జరిగేది. మార్కెట్ చుట్టూ కాలనీలు వెలియడం, వాహనాల రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటంతో ఈ మార్కెట్‌ను కోహెడకు తరలించాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. ఆ మేరకు 2018లో కోహెడలో 198 ఎకరాలు కేటాయించింది. తాత్కాలిక షెడ్లు వేసి, ఇక్కడి నుంచి బలవంతంగా రైతులను, కమీషన్ ఏజెంట్లను ఖాళీ చేయించింది. కానీ ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా ఎత్తకపోవడం గమనార్హం.

వరదనీటిలో కొట్టుకుపోతున్న పండ్లు

2020 మే4న ఈదురు గాలితో కూడిన వర్షానికి కోహెడలోని తాత్కాలిక షెడ్లు కుప్పకూలడంతో తాత్కాలికంగా బాటసింగారం ట్రక్‌పార్కుకు తర లించారు. అక్కడ కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కేవలం రెండు షెడ్లు మాత్రమే ఏర్పాటు చేశారు. వీటిలో దానిమ్మ, నారింజ, యాపిల్, సపోట, జామ, ద్రాక్ష పండ్లు విక్రయిస్తుం టారు. బొప్పాయి, కర్బూజా, పుచ్చ, మామిడి, పనస, పైనాపిల్ వంటి పండ్లు బహిరంగ ప్రదేశం లోనే కుప్పలుగా పోసి విక్రయిస్తుంటారు. ఇక్కడికి రోజుకు సగటున 300 వాహనాల్లో వెయ్యి టన్నుల వరకు పండ్లు వస్తుంటాయి. 320 మంది ఏజెంట్లు, 600 మంది రైతులు, చిరు వ్యాపారులు, సాధారణ కొనుగోలు దారులతో రద్దీగా కన్పిస్తుంది. సందర్శ కుల నిష్పత్తి మేరకు మౌలిక సదుపాయాలు లేవు. వర్షం వస్తే తడిసి ముద్దవ్వాల్సిందే. ఎగువ నుంచి వచ్చే వరద పండ్ల రాశుల మధ్య నుంచే కిందికి వెళ్తుంది. నిగనిగలాడాల్సిన పండ్లు బురదతో మురికిగా మారుతున్నాయి. వీటిని కొనేందుకు ఎవరూ ఇష్ట పడకపోవడంతో రైతులతో పాటు వ్యాపారులు నష్టపోవాల్సి వస్తోంది.



దారి ఇలా.. వెళ్లేదెలా..



మురుగుతో నిండిన ఆవరణ



ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన మహిళలు

ఓటు నమోదు చేసుకోండి

- మరో అవకాశం కల్పించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ అర్హులే..
- తప్పుల సవరణ, చిరునామా మార్పులు, తొలగింపులకూ చాన్స్
- అక్టోబర్ 19 నుంచి 28 వరకు దరఖాస్తుల పరిశీలన
- అక్టోబర్ 29న ఓటరు ముసాయిదా జాబితా వెల్లడి
- జనవరి 6న ఓటరు తుది జాబితా విడుదల

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల నాటికి ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు
షాద్‌నగర్	2,38,478
చేవెళ్ల	2,69,960
ఇబ్రహీంపట్నం	3,39,381
మహేశ్వరం	5,56,741
కల్వకుర్తి	2,44,405
రాజేంద్రనగర్	6,12,170
శేరిలింగంపల్లి	7,58,102

షాద్‌నగర్: ఓటరు జాబితాలో మీరు పేరు ఉం దా.. లేదంటే వెంటనే నమోదు చేసుకోండి. ఓటు నమోదు, ఓటరు జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. త్వరలో జరిగే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా రూపక ల్పన, నూతన ఓటు హక్కు నమోదుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా, నూతన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారు లకు ఆదేశాలు జారీ చేసింది.

ఇంటింటా సర్వే

2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అర్హులైన వారి వివరాలు సేకరించేందుకు బీఎ ల్‌వోలు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఈ సర్వే సెప్టెంబర్ 15 వరకు జరగనుంది. కొత్తగా ఓటు హక్కు పొందేందుకు, ఓటరు జాబితాలో తప్పుల సవరణ, చిరునామా మార్పులు, తొల గింపులు వంటి వాటికి బీఎల్‌వోలకు దరఖాస్తు అందజేయాలి. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు.

క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల పరిశీలన

నూతనంగా ఓటు హక్కు నమోదు కోసం చేసు కున్న దరఖాస్తులను అధికారులు క్షేత్ర స్థాయిలో అక్టోబర్ 19 నుంచి 28 వరకు పరిశీ లించనున్నారు. అక్టోబర్ 29న ఓటరు ముసా యిదా జాబితాను వెల్లడిస్తారు. అనంతరం నవంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరి స్తారు. అభ్యంతరాలను డిసెంబర్ 12 వరకు పరిశీలిస్తారు. 2025 జనవరి 6న ఓటరు తుది జాబితా విడుదల చేస్తారు.

దరఖాస్తు చేసుకోవాలి



ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధా న్యత ఉంది. ఓటు హక్కులేని 18 ఏళ్లు నిండిన అర్హులైన యు వతీ యువకులు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలి.

– వెంకట మాధవరావు, ఆర్డీఓ, షాద్‌నగర్



దీక్ష స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, పార్టీ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు

షరతులు లేకుండా మాఫీ చేయాలి

చేవెళ్ల: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా పం ట రుణాలు మాఫీ చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో గురువారం బీఆర్‌ఎస్‌పార్టీ చేపట్టే రైతు నిరసన దీక్ష స్థలాన్ని బుధవారం వారు స్థానిక నాయకు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నిరసన దీక్షకు బీఆర్‌ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి, పలువురు నాయ కులు హాజరుకానున్నట్లు తెలిపారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచిందని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకండా రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని ప్రజలు గుర్తించా లని, వారికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఈ రైతు ధర్నా చేపట్టినట్లు తెలి పారు. ధర్నాకు పెద్ద సంఖ్యలో చేవెళ్ల నియోజ కవర్గం నుంచి రైతులు, ప్రజలు, పార్టీ నాయ కులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపుని చ్చారు. అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు దండోరా వేయించి రైతులకు జరుగుతున్న మోసా లను నిలదీసేందుకు తమతో కలిసి రావాలని కోరాలన్నారు. 100 రోజులు అని ఆరునెలలు అని తరువాత ఎంపీ ఎన్నికల్లో గెలిపించిన వెంటనే చేస్తామని, ఎన్నికలు పూర్తి చేసిన తరువాత ఆగస్టు 15 వరకు విడుతల వారీగా చేస్తామని నమ్మి వచ్చా రన్నారు. రైతులకు జరుగుతున్న మోసాన్ని ప్రజల ముందు పెట్టాలనే బీఆర్‌ఎస్ పార్టీ పోరా డుతుందని, రైతులకు న్యాయం చేసే వరకు అం డగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గం నాయకుడు దేశమోళ్ల అంజనే యులు, కనీసవేతన బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, రాష్ట్ర నాయకులు అనంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు పి. ప్రభాకర్ తదితరులు ల్గొన్నారు.

945 చెరువుల సర్వే పూర్తి

- మిగిలినవి సత్వరమే పూర్తి చేయాలి
- సంబంధిత అధికారులను ఆదేశించిన కలెక్టర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని చెరువుల సర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ఆర్డీఓలు, ఇరిగేషన్ అధికారులు, హెచ్‌ఎండీఏ నోడల్ అధికారులతో చెరువుల సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,075 చెరువులు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 945 సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన చెరు వులకు సంబంధించిన సర్వే చేయాల్సి ఉందన్నారు. వారంలోగా ఆయా చెరువుల సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారుల నుం చి గ్రామ నక్షలను, పహాణీలను తీసుకొని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్, బఫర్లను గుర్తిస్తూ కడీలను, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించే సమయంలో ఆయా చెరువు లకు సంబంధించిన మ్యాపులను తీసుకెళ్లి పరిశీలిం చాలన్నారు. తొలుత మండల తహసీల్దార్లు, ఇరిగేష న్ ఏఈలు సంయుక్తంగా తమ పరిధిలోని చెరువు లను పరిశీలించి డివిజన్ స్థాయికి నివేదికలు పంపా లని, ఫైనల్ సర్వే నిర్వహించిన వెంటనే ఆయా చెరువుల నివేదికలను హెచ్‌ఎండీఏకు పంపించా లన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించి ఆ మేరకు కడీలను ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధి కారులను ఆదేశించారు. ఏదైనా చెరువు కబ్జాకు గురువుతున్నట్లు సమాచారం అందితే వెంటనే స్పం దించి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీ ఓలు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిరాం, వేణుమాధవ్, ఇరిగేషన్ డీఈ నరేందర్ రెడ్డి, హెచ్‌ఎండీఏ నోడల్ అధికారి రమాదేవి తదిత రులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శశాంక, చిత్రంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

ఎల్‌ఆర్‌ఎస్ సకాలంలో పూర్తి చేయాలి

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను సకాలంలో పరిశీలిం చి, ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధి కారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి 2,37,259 దరఖా స్తులు రాగా, అందులో 1,96,154 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పరిశీలించాలన్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి సకాలంలో పూర్తిచేయాల న్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అప్లికేషన్ ప్రక్రియను సర ళీకృతం చేయడానికి, క్రమబద్ధీకరించడానికి సీజీజీ ద్వారా పారదర్శక ఆన్‌లైన్ సాధనం రూపొందించాలన్నారు. ప్రభుత్వ భూములు మొదలైన వాటిలో ప్లాట్లు / లేఅవుట్‌ల క్రమబద్ధీ కరణ మార్గదర్శకాలపై మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కార్యాచరణ రూపొందించుకొని పని చేయాలన్నారు. సమా వేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీపీఓ సురేష్ మోహన్, ఆర్డీఓలు సూరజ్ కుమార్, అనంత రెడ్డి, వెంకట్ రెడ్డి, సాయిరాం, వేణుమా ధవ్, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిష నర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిండని జంట జలాశయాలు

- ఎగువ ప్రాంతాల నుంచి కనిపించని వరద
- గతేడాది కంటే 7 అడుగులు తక్కువగానే..
- ఈసీ, మూసీ వాగులు వెలవెల
- సీజన్ చివరిలో భారీ వర్షాలపైనే ఆశలు



ఉస్మాన్‌సాగర్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు సరఫరా చేసే నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరిన సమయంలో ఆదు కునే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల్లో నీటిమట్టం పరిస్థితి ఆందోళనకరం గా మారింది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నీటి మట్టం పెరగని పరిస్థితి నెలకొంది. ఎగువ ప్రాంతాల్లో ఆశించిన వర్షాలు లేక ఈసీ, మూసీ నదులు వెలవెలబోతున్నాయి. ఫలితంగా దిగువన ఉన్న జంట జలాశయాలకు వరద నీరు ప్రశ్నార్థకంగా తయారైంది. ఏటా వర్షా కాలంలో ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఈసారి పరిస్థితి తారుమారైంది. గతేడాదితో పోల్చితే రెండు జలాశయాల్లో నీటిమట్టం సగటున 7 అడుగులు తక్కువగా కనిపిస్తోంది.

పరిమిత టీఎంసీలు..

ప్రస్తుతం జంట జలాశయాల్లో నీటిమట్టం సామర్థ్యం సగం టీఎంసీలకు పరితమైంది. ఉస్మాన్‌సాగర్ జలాశయం మొత్తం సామర్థ్యం 3.900 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.984 టీఎం సీలకే పరిమితమైంది. గతేడాది 3.328 టీఎంసీలు ఉనట్లు గణాంకాలు స్పష్టం చేస్తునాయి. హిమా యత్‌సాగర్‌లో మొత్తం 2.967 టీఎంసీలు నిల్వ సామర్థ్యం కాగా.. ప్రస్తుత 1.675 టీఎంసీలు మాత్రమే ఉంది. అదే గతేడాది 2.595 టీఎంసీలు ఉంది. వాస్తవంగా ఎగువ ప్రాంతాల్లో కురిసే భారీ వర్షాలకు ప్రతిసారి రోజువారీగా సుమారు నాలుగు వేల నుంచి ఆరువేల క్యూసెక్కుల నీరు వచ్చి నిండుకుండలా మారుతాయి. రెండింటిలో వరదనీరు పోటెత్తడంతో గేట్లు ఎత్తి దిగువన వర దనీటిని మూసీ నదిలోకి విడుదల చేస్తుంటారు. ఈసారి మాత్రం వరద ప్రవాహం లేకుండాపో యింది. సీజన్ చివరిలో కురిసే భారీ వర్షాలే ఆధారంగా కనిపిస్తోంది.

భవిష్యత్ అవసరాల దృష్ట్యా..

నగర నీటి అవసరాల దృష్ట్యా ఆఖరి నిజాం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పేరిట జంట రిజర్వాయర్లను నిర్మించారు. అప్పటి నుంచి నగ రానికి ఇవి తాగునీరు అందిస్తున్నాయి. కృష్ణా, గోదావరి నీటి సరఫరా పథకాలు ప్రారంభం అనంతరం ఎంతో చారిత్రక ప్రాశస్త్యం గల రెండు రిజర్వాయర్లు గత పాలకుల తీరు నిర్లక్ష్యానికి గుర య్యాయి. గత వేసవిలో సాగర్, ఎల్లంపల్లి జలాశ యాల్లో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో జంట జలాశయాలు కొంత ఆదుకున్నాయి. వాస్తవంగా హైదరాబాద్ నగర ప్రజల వినియోగం కోసం ఉస్మాన్ సాగర్ నుంచి ఏడాది పొడవునా 64 మిలి యన్ లీటర్ల నీటిని వినిగిస్తుంటారు. ఈ వేసవి వినియోగం 108 మిలియన్ లీటర్లకు పెరిగింది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

జలాశయం	మొత్తం నీటిమట్టం	ప్రస్తుతం	గతేడాది (అడుగుల్లో)
ఉస్మాన్‌సాగర్	1,790.000	1,780.000	1,787.500
హిమాయత్‌సాగర్	1,763.500	1,755.500	1,761.950

రాంగ్‌రూట్‌లో వెళ్లి.. మృత్యు ఒడికి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నందిగామ: రాంగ్‌రూట్ ప్రయాణం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల శివారులోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపాలకృష్ణ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం లింబ్యాతండాకు చెందిన నేనావత్ చందు(47) అతడి భార్య జ్యోతితో కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై నందిగామ మండలం ధన్‌సింగ్‌తండాకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై షాద్‌నగర్ వైపునకు రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామానికి చెందిన మిద్య సురేశ్ బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో చందు ఎడమ వైపు కింద పడిపోవడంతో అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న ట్రక్కు ఆయన్ని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సురేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రభుత్వ కృషి అభినందనీయం

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నేతలు


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నేతలు

మొయినాబాద్: గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం సమితి నాయకులు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం గీతన్నలకు రూ.2 లక్షల సేఫ్టీ మోకులను అందజేసిందన్నారు. అదే విధంగా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును ప్రతిపాదించడం, ట్యాంక్‌బాండ్‌పై ఆయన విగ్రహం పెట్టేందుకు సన్నాహాలు చేయడం హర్షణీయమన్నారు. గౌడల సంక్షేమానికి కృషి చేసిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు కృష్ణగౌడ్, అంజయ్యగౌడ్, నాగార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు


బడంగ్‌పేటలో మేస్త్రీలకు బహుమతులు అందిస్తున్న భారతి సిమెంట్ ఉద్యోగులు

బడంగ్‌పేట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో.. ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని టెక్నికల్ ఇంజనీర్ మహమ్మద్ సాహెర్ అన్నారు. బుధవారం బడంగ్‌పేటలోని రామ్ స్టీల్ డీలర్ దుకాణంలో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని స్పష్టంచేశారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అదనంగా ఉంటుందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 40 మందికి పైగా మేస్త్రీలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని.. వ్యక్తి మృతి!

కొత్తూరు: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని వినాయక స్టీల్ పరిశ్రమ సమీపంలో రైలు పట్టాలపై బుధవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక స్టీల్ పరిశ్రమ వెనకాల రైలు పట్టాలపై మృతదేహం పడి ఉందని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ రహమత్ సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించగా సుమారు 40–45 ఏళ్లలోపు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పేర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడిది ఆత్మహత్యనా? ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదామా? అనే వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఏసీపీ ఆధ్వర్యంలో తనిఖీలు


మైసిగండిలోని కిరాణాషాపులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆమనగల్లు: ఆమనగల్లు, కడ్తాల మండలాలలో బుధవారం షాద్‌నగర్ ఏసీపీ ఎస్‌సీహెచ్ రంగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని బెల్ట్ షాపులు, కిరాణాషాపులు, కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవస్థానం వద్ద కిరాణా షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి భారీగా మద్యం పట్టుకున్నారు. దాడులకు సంబంధించి మొత్తం 9 కేసులను నమోదు చేశారు. మైసిగండిలో మద్యం పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఆమనగల్లు పట్టణంలో రెండు కిరాణాషాపులలో మద్యం, రెండు కిరాణా షాపులలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకుని నాలుగు కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. గంజాయి మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ దాడుల్లో ఆయా ప్రాంతాల్లోని సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, ఎస్ఐలు వెంకటేశ్, వరప్రసాద్, కృష్ణయ్య, శ్రీకాంత్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఊరగాయలో బల్లి

- నాంపల్లిలోని మహేశ్ హోటల్‌లో ఘటన

నాంపల్లి: తిరుపతికి వెళ్లి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్న భక్తులకు నగరంలో అపశృతి చోటుచేసుకుంది. నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో బల్లిపడిన వంటకాన్ని తిని వాంతులు చేసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి నాంపల్లి శాంతిభద్రతల పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన 30 మంది భక్తులు దైవదర్శనం కోసం ఇటీవల తిరుపతికి వెళ్లారు. దర్శనం అనంతరం రైలులో మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. బుధవారం ఉదయాన్నే సొంతూరు వెళ్లాల్సి ఉంది. రాత్రి నగరంలోనే బస చేయడంతో స్థానిక మహేష్ రెస్టారెంట్‌లో డిన్నర్ చేశారు. 30 మంది ఒకేసారి భోజనాలు చేస్తుండగా ఊరగాయ(పికిల్)లో చనిపోయిన బల్లిని చూశారు. అన్నంలో ఊరగాయను వేసుకుని కలుపుతుండగా ఓ భక్తుడి చేతికి బల్లి తగిలింది. దీంతో అతడక్కడే వాంతులు చేసుకున్నారు. మిగతా వారూ అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. వీరంతా త్వరగానే కోలుకోవడంతో తిరిగి ఉదయాన్నే తిరుగుపయనం అయ్యారు. పోలీసులు మహేష్ హోటల్‌ను మూసివేయించారు.

కంది సాగు.. ఖరీఫ్‌లో బాగు

- అధిక లాభాలు పొందొచ్చు
- షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం



షాబాద్: అంతర్జాతీయంగా ఏర్పడిన పరిణామాలతో పత్తికి ధర పడిపోవడంతో రైతుల్లో నిరాశ ఆవహించింది. దీంతో పత్తికి ప్రత్యామ్నాయంగా కంది సాగు చేసుకొని అధిక దిగుబడి పొందొచ్చని షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం సూచిస్తున్నారు. కంది పంటను ఆశించే పురుగు, తెగుళ్ల నివారణ కోసం రైతులు తీసుకోవాల్సిన చర్యలను ఆయన తెలిపారు. ఖరీఫ్, రబీలో సాగు చేసే కంది పంటను కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆకుపచ్చ పురుగు

కంది పెరిగే దశలో పురుగు ఆశిస్తుంది. ఆకులు, పూతను చుట్టుగా చుట్టుకొని లోపల ఉండి పంటను నాశనం చేస్తుంది. దీని నివారణకు 1.6 మీ.లీ మోనోక్రోటాస్ లేదా 2.0 మీ.లీ క్వినాలపాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు

ఈ పురుగు పూత, పిందె దశలో కాయలకు రంధ్రాలు చేసి గింజలను తింటూ ఒక కాయ నుంచి మరోకాయను ఆశిస్తుంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ తప్పక పాటించాలి.

ఎండు తెగులు

మొక్కలో కొంతభాగం ఎండిపోతాయి. ఎండిన మొక్కలను పీకి కాండమొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. నివారణకు తెగులు అధికంగా కనిపించిన పొలాల్లో పొగాకు లేదా జొన్నతో పంట మార్పిడి చేయాలి. ఐసీపీఎస్ 87119, ఐసీపీఎస్ 8863 అనే కంది రకాలు ఈ తెగులను తట్టుకుంటాయి.

వెర్రి తెగులు (స్టెరిలిటి మొజాయిక్)

ఈ వైరస్ తెగులు సోకిన మొక్క లేత ఆకుపచ్చ రంగు గల చిన్న ఆకులను విపరీతంగా తొడుగుతుంది. పూత పూయదు, ఈ తెగలు నల్లి ద్వారా వ్యాపిస్తుంది. నల్లి నివారణకు లీటరు నీటిలో 3 గ్రాములు నీటిలో కరిగే గంధపు పొడి లేదా 4 మి.లీ డైకోఫాల్‌ను కలిపి వారానికి ఒకటి, రెండుసార్లు పిచికారీ చేయాలి.

మాక్రోఫోమినా ఎండు తెగులు

ముదురు మొక్కల కాండంపైనా నూలుకంటే ఆకారం కలిగిన గోధుమ వర్ణపు మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చల చుట్టూ గోధుమ వర్ణమయంలోనూ మధ్యభాగం తెలుపు వర్ణంలో ఎండిపోతాయి. కొన్నిసార్లు కొమ్మలు మాత్రమే ఎండిపోతాయి. నివారణకు ఎంఆర్‌జీ66 కంది రకాన్ని సాగు చేయాలి. కంది ఎక్కువ కాలం ఒకే పొలంలో వేయరాదు.

పంటకోత నిల్వ

అన్ని కాయలు ఎండిన అనంతరమే కంది పంటను కోయాలి. లేకపోతే పూత రెండు నెలల వరకు పూస్తూనే ఉంటుంది. ఎండిన తరువాత కట్టెలతో కొట్టి కాయల నుంచి గింజలను వేరు చేయాలి. కందులను బూడిద లేదా వేప ఆకులు కలిపి నిల్వ చేస్తారు. నిల్వ చేసేటప్పుడు పురుగులు ఆశించకుండా ఉండేందుకు బాగా ఎండబెట్టాలి.


రేగడిదోస్వాడలో సాగు చేస్తున్న కంది పంట (ఫైల్)

సమగ్ర సస్యరక్షణ

- వేసవిలో లోతు దుక్కి చేస్తే భూమిలోని పురుగు కోశస్థ దశలు బయటపడి పక్షులు ఏరుకుతింటాయి. ఈ పురుగు ఎక్కువగా ఆశించే పంటలపైన జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుములు, ఉలవ, వరి మొదలైన పంట మార్పిడి చేయాలి.
- ఖరీఫ్‌లో అంతర పంటగా 7 సాళ్లు, రబీలో 3 సాళ్లు పెసర, మినుము వేయడం ద్వారా పరాన్న జీవులు వృద్ధి చెందడానికి తోడ్పడతాయి. పొలం చుట్టూ నాలుగు సాళ్లు జొన్న రక్షిత పైరుగా విత్తాలి.
- పురుగు గుడ్డును, తొలిదశ పురుగులను గమనించి వెంటనే 5 శాతం వేప గింజల కషాయాన్ని లేదా సంబంధమైన మందు(అజా డిరాక్టిన్)లను పిచికారీ చేయాలి.

సరైన నష్ట పరిహారం చెల్లించాలి

- రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి
- విద్యుత్ టవర్ల ఏర్పాటును అడ్డుకున్న రైతులు


పనులు అడ్డుకున్న రైతులు

చేవెళ్ల: పొలాల మీదుగా వెళ్తున్న విద్యుత్ టవర్లు, లైన్‌లతో భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం అందించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రేగడిఘనాపూర్, దేవరంపల్లి, ఖానాపూర్ అంతారం తదితర గ్రామాల మీదుగా వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ తీగల పనులను రైతులు అడ్డుకొని సరైన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న సత్యనారాయణరెడ్డి అక్కడి వెళ్లి రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ టవర్ల ఏర్పాటుతో రైతులు ఎలాంటి పనులు చేసుకోలేని పరిస్థితి ఉంటుందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు విద్యుత్ చట్టం 2003 ప్రకారం సంపూర్ణ నష్టపరిహారం చెల్లించాలన్నారు. భూసేకరణ 2013 ప్రకారం భూముల నష్టపరిహారం ప్రస్తుత మార్కెట్ ధరలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అనంతరం సత్యనారాయణరెడ్డి కంపెనీ ప్రతినిధులతో చర్చించి వెంటనే రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మాట్లాడుతామని చెప్పారు. అప్పటి వరకు పనులు చేయవద్దని రైతులు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కుట్రలను ఐక్యంగా తిప్పి కొట్టాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్‌మాల


బస్టాండ్‌లో ఆందోళన చేపట్టిన నాయకులు

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ విషయంలో జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టేందుకు అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్‌మాల పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం షాద్‌నగర్‌లో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి నాయకులు తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను మూసి వేయించారు. షాద్‌నగర్ బస్టాండ్, చౌరస్తాలో నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మహేశ్‌మాల మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పును తిరిగి పరిశీలించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ ముందుకు సాగి రాజ్యాధికారం సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మొయినాబాద్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ గేదె ప్రాణం తీసింది. తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని చిలుకూరులో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడిపల్లి బాలయ్య కుటుంబం గేదెల పోషణ చేస్తూ జీవనం సాగిస్తుంది. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం గేదెలను గండిపేట చెరువు వైపు మేపడానికి తీసుకెళ్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగ ఓ గేదెకు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.80 వేల విలువ చేసే గేదె మృతి చెందడంతో బాలయ్య దంపతులు గేదె వద్ద బోరున విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

శీర్షాసనం వేసి వినూత్న నిరసన

- భూ సమస్య పరిష్కరించడం లేదని యువకుడి ఆందోళన
- తహసీల్ కార్యాలయంలో తలకిందులుగా నిరసన
- పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన తహసీల్దార్


జీవన్


భూ సమస్య పరిష్కరించాలని శీర్షాసనం వేసి నిరసన తెలియజేస్తున్న జీవన్

ఇబ్రహీంపట్నం: నెలల తరబడి తిరుగుతున్నా భూ సమస్య పరిష్కారం కావడం లేదని ఓ బాధితుడు తహసీల్దార్ కార్యాలయంలో శీర్షాసనం వేసి వినూత్న నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లి గ్రామానికి చెందిన ఉల్లింతల జయసుధ 374 సర్వే నంబర్‌లో ఎకరా 32 గుంటల భూమిని 15 సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారు. ఈ సర్వే నంబర్‌లో ఎకరా రెండు గుంటల భూమి సీలింగ్ కింద ఉండటంతో ధరణి పోర్టల్ వచ్చిన అనంతరం నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ నేపథ్యంలో నిషేధిత జాబితా నుంచి తొలగించి, తమ భూ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు జయసుధ దరఖాస్తు పెట్టుకున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో టాటా ఇనిస్టిట్యూట్‌లో సోషల్ సైన్సెస్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఆమె కుమారుడు జీవన్ ఆందోళనకు దిగాడు. తమ భూ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని బుధవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో శీర్షాసనం వేసి నిరసన వ్యక్తం చేశాడు. స్పందించిన తహసీల్దార్ సునీత మాట్లాడుతూ.. సమస్య ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందని, నిషేధిత జాబితాను పరిశీలించి, ఆ సర్వే నంబర్‌లోని రైతులకు నోటీసులు అందజేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ సూచన మేరకు జీవన్ నిరసన విరమించాడు.

అధికారులు విఫలం

ధరణి సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలయ్యారని జీవన్ ఆరోపించాడు. సమస్యను పరిష్కరించాలని నెలల తరబడి తమ కుటుంబసభ్యులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యావంతులకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో గమనించాలని పేర్కొన్నాడు. 20 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారని తెలిపాడు.

'తప్పుడు నివేదికతో అన్యాయం'

భూ బాధితుల ఆరోపణ

షాద్‌నగర్ రూరల్: రెవెన్యూ అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికతో.. తమకు అన్యాయం జరిగిందని బాధితులు ఆరోపించారు. వారి వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామానికి చెందిన పోలె తిరుమలయ్యకు స్థానికంగా ఎకరా ఇరవై గుంటల అసైన్డ్ భూమి ఉంది. ఇతనికి పెంటమ్మ, కిష్టమ్మ ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు సంతానం లేదు. రెండో భార్య కూతురు శారదకు కొన్నేళ్ల క్రితమే వివాహం జరిగింది. అనంతరం రెండో భార్య కిష్టమ్మ మృతి చెందింది. వృద్ధాప్యంలో తమకు అండగా ఉండి అన్ని సపర్యలు చేస్తున్న తిరుమలయ్య తమ్ముడి కొడుకైన పోలె అంజయ్యకు తమ భూమిని రిజిస్టర్ వీలునామా చేశారు. ఇందుకు శారద సైతం సమ్మతించడంతో ఆమెకు 2019లో కొంత నగదు, ఆభరణాలను బహుమానంగా ఇచ్చి, పెద్దల సమక్షంలో బాండ్ పేపర్లు రాయించుకున్నారు. అనంతరం 2023లో తిరుమలయ్య మృతి చెందాడు. దీంతో అంజయ్య తన పేరుపై భూమిని విరాసత్ చేసుకునేందుకు ధరణిలో దరఖాస్తు చేసుకున్నాడు. రిజిస్టర్ వీలునామాలో తిరుమలయ్యతో పాటు సాక్షిగా ఆయన మొదటి భార్య పెంటమ్మ సంతకం చేసింది. ఇది పరిశీలించిన రెవెన్యూ అధికారులు అంజయ్య పేరుపై భూమిని విరాసత్ చేశారు. అయితే తండ్రి మరణం తర్వాత.. ఆయన పేరున ఉన్న భూమిని తన పేరుపై చేయాలని కోరుతూ శారద రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుంది. వారసురాలిని నేనే అంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. దీనిపై గ్రామంలో విచారణ చేపట్టిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. తిరుమలయ్య, పెంటమ్మ దంపతులు కలిసి అంజయ్యకు చేసిన రిజిస్టర్ వీలునామాను.. అగ్రిమెంట్ కం సేల్ డీడ్ అని నివేదిక ఇచ్చారు. అనుమానం వచ్చిన అంజయ్య సమాచార చట్టం కింద దరఖాస్తు చేసుకోగా ఈ విషయం వెలుగు చూసింది. దీనిపై తహసీల్దార్ పార్థసారధి, ఆర్ఐ విజయలక్ష్మిని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

వర్షాలు కురిసే.. జలధార మెరిసే


జలకళతో మాసబ్ చెరువు

తుర్కయంజాల్: గతంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా 5వ సారి మాసబ్ చెరువు నిండి అలుగు పారుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండటంతో చెరువు నిండు కుండలా మారింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో అలుగు పారుతుంది. దీంతో చుట్టు పక్కల ప్రజలు, సాగర్ రహదారి వెంట వెళ్లే వాహనదారులు వాగును తిలకిస్తున్నారు. మాసబ్ చెరువు వాగు ద్వారా నీరు కింద ఉన్నటువంటి ఇంజాపూర్‌లోని దిలావర్ ఖాన్ చెరువులోకి చేరుతుంది. దీంతో ముంపు కాలనీల ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు.